ANN తెలుగు
Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
02-08-2025
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 239 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD గురువారం WWW.EPAPER.MAHAADAILY.COM



## బాలయ్య సినిమాకు నేషనల్ అవార్డు

- 71వ ఉత్తమ చలన చిత్ర అవార్డుల ప్రకటన
- బెస్ట్ యాక్టర్స్‌గా దుమ్ములేపిన షారుక్ ఖాన్, విక్రాంత్ మస్సే.. ఉత్తమ నటి రాణీ ముఖర్జీ
- బెస్ట్ తెలుగు మూవీగా బాలయ్య 'భగవంత్ కేసరి'
- బలగం పాటకు కాసర్లశ్యామ్ కు అవార్డు
- ఏకంగా 7 అవార్డులు దక్కించుకున్న తెలుగు చిత్రసీమ

వివరాలు 4లో

టాప్ న్యూస్


### పింక్ మీడియాకు పొంగులేటి వార్నింగ్



- మీ అబద్దాలు వక్రీకరణలు
- ఒక స్థాయి వరకే ఉపేక్షిస్తాం
- ముఖ్యమంత్రికి, వ్యవస్థలకు గౌరవం లేకుండా కొందరు వ్యవహరిస్తున్నారు

02

### కేసీఆర్, కేటీఆర్ ఇద్దరికీ విలువలు లేవు



- కడియం శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు

02

### సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక

- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ఆగస్టు 7న నోటిఫికేషన్, 21న నామినేషన్‌కు చివరి తేదీ
- సెప్టెంబర్ 9న పోలింగ్.. అదే రోజు కౌంటింగ్

02

SRI GOLD
TRUSTED GOLD BUYERS

| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 99,810 |
| 22 క్యారెట్ | 91,490 |
| సిల్వర్ (కేజీ) | 1,12,900 |



02

# గళమెత్తాలన్నా.. గద్దె దింపాలన్నా కమ్యూనిస్టులే...

## రెండుసార్లు వాళ్ళ పోరాటం వల్లే కాంగ్రెస్‌కు పవర్

- భవిష్యత్తులోనూ కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి సాగాలి
- ఓనమాలు రానోళ్ళు కూడా.. జర్నలిస్టులమంటున్నరు
- సోషల్ మీడియా ముసుగులో విషం చిమ్ముతున్నరు: సీఎం రేవంత్ రెడ్డి



## మా దగ్గర ఆటమ్ బాంబ్ ఉంది

- పేలిన రోజు ఈసీ దాక్కోవడానికి అవకాశమే ఉండదు
- బీజేపీ కోసమే ఈసీ ఓట్ల చౌర్యం
- దేశ ద్రోహం కంటే తక్కువేమీ కాదు
- ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి సంచలన వ్యాఖ్యలు
- అవన్నీ నిరాధార ఆరోపణలేనని ఈసీ మండిపాటు

వివరాలు 2లో

# గొర్రెల స్కాం రూ.1000 కోట్లు

## గుర్తించిన ఈడీ.. మాజీ మంత్రి తలసాని ఓఎస్డీ ఇంట్లో ఈడీ సోదాలు

### లబ్ధిదారులకు వెళ్లాల్సిన నిధులు ప్రైవేటు వ్యక్తుల ఖాతాలకు వెళ్లినట్లు గుర్తింపు

### కుంభకోణంలో పెద్దల పాత్ర

**హైదరాబాద్, మహా:**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన గొర్రెల పంపిణీ స్కీంలో రూ.వెయ్యి కోట్లపైనే అక్రమాలు జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గుర్తించింది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అప్పటి ఓఎస్డీ కల్యాణ్ ఇంట్లో ఈడీ అధికారులు కేసు సంబంధించి సోదాలు శుక్రవారం కూడా నిర్వహించారు. 200కు పైగా బ్యాంకు అకౌంట్లకు చెందిన పాస్‌పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. అవే బ్యాంకు ఖాతాలను బెట్టింగ్ అప్లికేషన్లలోనూ ఉపయోగించినట్లు అధికారులు గుర్తించారు. ఈడీ సోదాల్లో 31 సెల్‌ఫోన్లు, 20 సిమ్‌కార్డులు లభించాయి. నిజమైన లబ్ధిదారులకు వెళ్లాల్సిన నిధులు ప్రైవేటు వ్యక్తుల ఖాతాలకు వెళ్లాయన్న ఈడీ, గొర్రెల పంపిణీలో తెలంగాణ వ్యాప్తంగా 33 జిల్లాల్లో రూ.వెయ్యి కోట్లకు పైగా అక్రమాలు జరిగినట్లు గుర్తించింది.

మిగతా 3లో





### సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో

# న్యూ తెలంగాణ మోడల్

## ప్రేమతో కూడుకున్న రాజనీతి మనది.. దేశానికి మోడల్ గా నిలిచాం

- ఉమ్మడి రంగారెడ్డి ముఖ్యనేతల సమావేశంలో ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్
- రెండోరోజు ఆందోల్ లో కొనసాగిన పాదయాత్ర.. పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్, మంత్రులు

03

| స్టాక్ మార్కెట్ | | |
|---|---|---|
| సెన్సెక్స్ | ↗ | 80,559.91 |
| నిఫ్టీ | ↗ | 24,565.35 |

**ఈరోజు చికెన్ ధరలు**

| 1 కేజీ రిటైల్ ధర ₹ | | |
|---|---|---|
| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
| 170 | 210 | 220 |

| హోల్ సేల్ ధర ₹ | | |
|---|---|---|
| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
| 160 | 200 | 210 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ ₹ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 4.2 | 126 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 4.2 | 126 |
| రిటైల్ గుడ్డు ధర | 4.45 | 136.08 |


# సీఎం చేతికి కాళేశ్వరం రిపోర్ట్

## తుది నివేదికను రేవంత్‌కు అందజేసిన ఉత్తమ్

- కాళేశ్వరం కమిషన్ నివేదికపై కమిటీ ఏర్పాటు
- ఇరిగేషన్ సెక్రటరీ, న్యాయ సెక్రటరీ, జేఏడీ సెక్రటరీ సభ్యులుగా నియామకం
- ఈ నెల 4న కేమినెట్‌కు సమర్పించనున్న కమిటీ
- తర్వాత అసెంబ్లీలోనూ ప్రవేశపెట్టే యోచనలో సర్కార్



02



## అమెరికాకు భారత్ షాక్

- ఎఫ్ 35 యుద్ధ విమానాల డీల్‌కు బ్రేక్
- దేశీయ తయారీపై దృష్టి

వివరాలు 2లో

## పొలం బాట పట్టిన ప్రజాప్రతినిధి

- నాటు వేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య
- రైతు కూలీ అక్కచెల్లెమ్మలతో సంపక్తి భోజనం
- పొలంలో నారు పికి 'వరి నాటు'లో మమేకం

వివరాలు 3లో



## జనవరి 26 నాటికి 4000 మెగావాట్ల విద్యుత్

- అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- వైటీపీఎస్ యూనిట్ 1ను జాతికి అంకితం చేసిన మంత్రులు
- వైటీపీఎస్‌లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ కూడా శంకుస్థాపన

02



# పింక్ మీడియాకు పొంగులేటి వార్నింగ్

**మీ అబద్దాలు వక్రీకరణలు.. ఒక స్థాయి వరకే ఉపేక్షిస్తాం**

**ముఖ్యమంత్రికి, వ్యవస్థలకు గౌరవం లేకుండా కొందరు వ్యవహరిస్తున్నారు**

**హైదరాబాద్, మహా:**



పింక్ కలర్ షేడ్ లో ఉన్న కొన్ని పత్రికలు, కొన్ని వ్యవస్థలు ప్రభుత్వం చేస్తున్న మంచిని చెప్పకుండా, వక్రీకరించి రాంగ్ రూట్ లో తీసుకువెళ్తాయని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. కొన్ని పింక్ కలర్ పత్రికలు రోజూ బ్యానర్ ఐటమ్స్ వక్రీకరణలు చేస్తూ నిజాన్ని అబద్దంగా అడ్డంగా రాస్తున్నారని, ముఖ్యమంత్రనే గౌరవం లేకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నవారు తమ అవివేకాన్ని, తప్పిదాలను తెలుసుకుంటారనే ఉద్దేశంతో ఈ ప్రభుత్వం ఉపేక్షిస్తున్నదని అన్నారు. పత్రికా స్వేచ్ఛను తాము గౌరవిస్తున్నామని, వక్రీకరణల రాతలను రాస్తున్న తమకు ఇష్టం లేని పత్రికలను ఇందులో భాగంగానే ఉపేక్షిస్తున్నట్లు చెప్పారు. నిజాలను అబద్ధాలుగా చిత్రీకరిస్తున్న పత్రికలకు సంబంధించి వారి మానాన వారే పోతారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఒక స్థాయి వరకే ప్రభుత్వం ఉపేక్షిస్తుందని పింక్ కలర్ మీడియా మిత్రులకు చెబుతున్నట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా ఎవరైనా రాసినా, ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నప్పటికీ, తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పాటు పడుతోందన్నారు. కమ్యూనిస్టులు కోరుకుంటున్న ప్రజాసంక్షేమ పాలననే కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోందన్నారు.

# జనవరి 26 నాటికి 4000 మెగావాట్ల విద్యుత్

- అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- వైటీపీఎస్ యూనిట్ -1ను జాతికి అంకితం చేసిన మంత్రులు
- వైటీపీఎస్‌లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ కూడా శంకుస్థాపన



**నల్గొండ, మహా:** నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (వైటీపీఎస్)లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొన్నారు. 55 ఎకరాల్లో రూ.970 కోట్లతో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌ను నిర్మించనున్నారు. అనంతరం యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం (వైటీపీఎస్)లోని 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌ను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజాధనం వృధా కాకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత సమయానికి పవర్ ప్లాంట్ పూర్తయ్యేలా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన ప్లాంట్ నిర్మాణం పనులు ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయని ఆరోపించారు. ప్రస్తుతం ప్రభుత్వంపై అధిక భారం పడుతున్నప్పటికీ ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ తీసుకోవడంతో పాటు పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రెండో యూనిట్ ఉత్పత్తి ప్రారంభం కాగా ప్రస్తుతం మొదటి యూనిట్ ప్రారంభించుకోవడం ఆనందంగా వ్యక్తం చేశారు. మిగిలిన యూనిట్లను కూడా పూర్తి చేసి జనవరి 26 నాటికి పూర్తి స్థాయి విద్యుత్తును అందించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు సిబ్బంది కోసం సకల సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ టౌన్షిప్ నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. వైటీపీఎస్ లోని ఉద్యోగులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలకు అత్యంత ఉన్నత ప్రమాణాలతో విద్య, వైద్యం అందించేందుకు పాఠశాల, వైద్యశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

**భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలు..**

యాదాద్రి పవర్ ప్లాంట్ తో పాటు పులిచింతలలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. అన్ని యూనిట్ల పనులను వేగవంతంగా పూర్తి చేసి వచ్చే జనవరి 26 నాటికి 4000 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ డిసెంబర్ చివరి నాటికి అన్ని యూనిట్ల పనులను పూర్తి చేస్తామని, 4000 మెగావాట్లు కలిగిన విద్యుత్ ఉత్పత్తిని 2026 జనవరి నుండి పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పవర్ ప్లాంట్ ఆవరణలో ఉద్యోగుల కోసం ఇంటిగ్రేటెడ్ టౌన్షిప్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ప్లాంట్ చుట్టూ ఉన్న ప్రాంతాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఈ ప్రాంత ప్రజల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, అత్యాధునిక వసతులతో ఆసుపత్రులు, అంబులెన్స్ సేవలు అందుబాటులోకి రాబోతున్నాయన్నారు. బొగ్గు, బూడిద లారీల కారణంగా దెబ్బతిన్న రోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తున్నామని, ఇందుకోసం రూ. 280 కోట్లను మంజూరు చేయడమే కాకుండా అవసరమైన క్లియరెన్స్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. నష్టపరిహారాలు, భూసేకరణ వంటి అంశాలను వెంటనే పూర్తి చేసి, యుద్ధ ప్రాతిపదికన రహదారి నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గుర్తు చేశారు.

# మా దగ్గర ఆటమ్ బాంబ్ ఉంది

**పేలిన రోజు ఈసీ దాక్కోవడానికి అవకాశమే ఉండదు**

**బీజేపీ కోసమే ఈసీ ఓట్ల చౌర్యం.. దేశ ద్రోహం కంటే తక్కువేమీ కాదు**

**ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి సంచలన వ్యాఖ్యలు**

**అవన్నీ నిరాధార ఆరోపణలేనని ఈసీ మండిపాటు**



**ఢిల్లీ, మహా:** కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. బీజేపీ కోసం ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించిన ఆయన.. దాన్ని రుజువు చేసేందుకు తమ వద్ద అణు బాంబు లాంటి ఆధారాలున్నాయని అన్నారు. ఈ ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. అయితే బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే. అనంతరం ముసాయిదా ఓటరు జాబితాను ఈసీ గురువారం విడుదల చేసింది. అయితే, ఈ ప్రక్రియను ముందు నుంచీ వ్యతిరేకిస్తోన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**లోక్‌సభలో ఎన్నికల్లోనూ అక్రమాలు..**

'రాష్ట్ర స్థాయి నుంచి ఓట్ల చౌర్యం జరుగుతోందని మేం ఎప్పటినుంచో అనుమానిస్తున్నాం. మధ్యప్రదేశ్, మహారాష్ట్రతో పాటు లోక్‌సభలో ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయి. ఓటరు సవరణ చేపట్టి కోట్లాది మంది కొత్త ఓటర్లను అదనంగా చేరుస్తున్నారు. దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేస్తే.. ఈసీ గురించి బయటపడింది. ఆరు నెలల పాటు మేం సొంతంగా దర్యాప్తు జరిపి ఆటమ్ బాంబు లాంటి ఆధారాలను గుర్తించాం. ఆ బాంబు పేలిన రోజు ఎన్నికల సంఘం దాక్కోవడానికి అవకాశమే ఉండదు' అని కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు. బీజేపీ కోసమే ఈసీ ఈ ఓట్ల చోరీకి పాల్పడుతోందని రాహుల్ మండిపడ్డారు. ఇది దేశ ద్రోహం కంటే తక్కువేం కాదని, దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఏ ఒక్కరినీ మేం వదిలిపెట్టేది లేదని వ్యాఖ్యానించారు. అధికారులు రిటైర్ అయినా.. ఎక్కడ దాక్కొన్నా మేం కనిపెడతామని విపక్ష నేత హెచ్చరించారు.

ఓట్ల చౌర్యంపై రాహుల్‌తో పాటు విపక్షాలు చేస్తోన్న ఆరోపణలు కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. అవన్నీ నిరాధార ఆరోపణలేనని తేల్చి చెప్పింది. ఇలా రోజూ వచ్చే బెదిరింపులను తాము పట్టించుకోబోమని తెలిపింది. రాహుల్ లాంటి వారు చేస్తోన్న బాధ్యతారాహిత్య వ్యాఖ్యలను పట్టించుకోనక్కర్లేదని తమ అధికారులకు చెప్పామని ఈసీ స్పష్టం చేసింది. పారదర్శకంగా పనిచేస్తూనే ఆరోపణలను విస్మరించాలని అధికారులకు సూచించింది.

# సీఎం చేతికి కాళేశ్వరం రిపోర్ట్

- తుది నివేదికను రేవంత్‌కు అందజేసిన ఉత్తమ్
- కాళేశ్వరం కమిషన్ నివేదికపై కమిటీ ఏర్పాటు
- ఇరిగేషన్ సెక్రటరీ, న్యాయ సెక్రటరీ, జేఏడీ సెక్రటరీ సభ్యులుగా నియామకం
- ఈ నెల 4న కేమినెట్‌కు సమర్పించనున్న కమిటీ
- తర్వాత అసెంబ్లీలోనూ ప్రవేశపెట్టే యోచనలో సర్కార్



**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల విషయంలో నియమించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందింది. జస్టిస్ పీసీ ఘోష్.. తమ కమిషన్ గడువు చివరి రోజున.. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారి రాహుల్ బొజ్జాకు నివేదిక ఇచ్చారు. ఆయన చీఫ్ సెక్రటరీకి పంపించారు. చీఫ్ సెక్రటరీ సీఎం రేవంత్ రెడ్డికి ఈ నివేదికలోని అంశాలను వివరించారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా హాజరయ్యారు. నివేదికను అధ్యయనం చేసి పూర్తి సారాంశాన్ని తయారు చేసేందుకు కమిటీని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నీటిపారుదల శాఖ సెక్రటరీ, న్యాయ శాఖ సెక్రటరీ, జీఏడీ సెక్రటరీ సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశారు. నివేదికను అధ్యయనం చేసి పూర్తి సారాంశాన్ని ఈ నెల 4న రాష్ట్ర కేబినెట్‌కు కమిటీ సమర్పించనుంది. మొత్తం ఈ రిపోర్ట్ 650 పేజీలకుపైగా ఉంది. కమిషన్ గుర్తించిన విషయాలు, అవకతవకలకు పాల్పడిన వైనం గురించి ఉన్న డీటెయిల్స్ మొత్తంతో నివేదికను ప్రస్తుతం నియమించిన కమిటీ సిద్ధం చేయనుంది.

**నివేదిక ఆధారంగా కేబినెట్ నిర్ణయం..**

ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయి..ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నది ఆ నివేదిక ఆధారంగా కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. క్రిమినల్ చర్యలు తీసుకునేదిశగా సిఫారసులు ఉంటాయని భావిస్తున్నారు. అయితే ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నది ప్రభుత్వ నిర్ణయం. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కకు కేవలం విచారణకు పిలిచే అధికారం మాత్రమే ఉంటుంది. అవకతవకలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు. అదే చేశారు. ఆ నివేదిక ఆధారంగా తదుపరి దర్యాప్తు చేయించడానికి ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేయాలా అన్నది డిసైడ్ చేస్తారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక విషయంలో ప్రభుత్వం తీసుకునే చర్యల విషయంలో బీఆర్ఎస్ నేతలు కూడా అప్రమత్తమయ్యారు. కేసీఆర్ రెండు రోజులుగా ఫామ్ హౌస్ లో కీలక నేతలతో చర్చలు జరుపుతున్నారు.



# కేసీఆర్, కేటీఆర్ ఇద్దరికీ విలువలు లేవు

**కడియం శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు**

**వరంగల్, మహా :**

కేసీఆర్, కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని అన్నారు. స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. కానీ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే.. నవ్వొస్తుందని విమర్శించారు. ఫిరాయింపులు మొదలు పెట్టిందే బీఆర్ఎస్ అని గుర్తుచేశారు. ఈ అంశంపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌లో ఎవరికీ లేదని అన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఇద్దరికీ విలువలు లేవని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవస్థలను విధ్వంసం చేశారని అన్నారు.

# అమెరికాకు భారత్ షాక్

**ఎఫ్ 35 యుద్ధ విమానాల డీల్‌కు బ్రేక్.. దేశీయ తయారీపై దృష్టి**

**మహా :** టారిఫ్ లతో ఊగిపోతున్న ట్రంప్ కు భారత్ సైలెంట్ గా షాకిచ్చింది. భారత్‌కు తన రక్షణ రంగ ఎగుమతులను మరింత విస్తరించాలని భావిస్తున్న అమెరికాకు ఆసక్తిలేదని చెప్పేసింది. ఇరుదేశాల మధ్య కుదిరిన ఎఫ్35 యుద్ధ విమానాల డీల్‌కు బ్రేకులు పడినట్లు తెలుస్తోంది. ఎఫ్35 విమానాల కొనుగోలుపై భారత్ ఆసక్తి చూపడం లేదని, ఇదే సమయంలో భారత్ ప్రాధాన్యతలకు అనుగుణంగా రష్యా కొత్త ప్రతిపాదనను తీసుకొచ్చినట్లు అంతర్జాతీయ పత్రికల్లో కథనాలు వెలువడుతున్నాయి. స్వదేశీ పరిజ్ఞానం, దేశీయ తయారీపై దృష్టి పెట్టడమే అమెరికా డీల్‌పై భారత్ ఆసక్తి చూపకపోవడానికి మరో కారణంగా తెలుస్తోంది.

**నీతో కుదరదు**

భారత్‌పై 25శాతం టారిఫ్‌లతోపాటు, పెనాల్టీ విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల వివాదానికి తెరలేపారు. ట్రంప్ సుంకాలకు భారత్ తక్షణమే దీటుగా బదులిచ్చే యోచన చేయడం లేదని, అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగించాలని కోరుకుంటోంది. అయితే కొత్త రక్షణ ఒప్పందాలను భారత్ ఆమోదించే అవకాశం లేదని తెలుస్తోంది. ఎఫ్35 యుద్ధ విమానాల కొనుగోలుపై ఆసక్తి లేదని అమెరికా అధికారులకు భారత్ చెప్పినట్లు కథనాలు వెలువడుతున్నాయి.

## స్వదేశీ తయారీ

స్వదేశీ పరిజ్ఞానం, దేశీయ తయారీపై దృష్టి పెట్టడమే అమెరికా డీల్‌పై భారత్ ఆసక్తి చూపకపోవడానికి మరో కారణంగా తెలుస్తోంది. దేశీయంగా రక్షణ పరికరాలను సంయుక్తంగా తయారు చేయడం, రూపొందించడంపై దృష్టి సారించే ఒప్పందాలపైనే ఇండియా ఎక్కువ ఆసక్తి చూపుతుందని రక్షణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా, శత్రుభీకరమైన ఎఫ్-35 యుద్ధవిమానాలను విక్రయించేందుకు యూఎస్ అంగీకరించింది .మోదీతో భేటీ అనంతరం ట్రంప్ డీల్‌పై ప్రకటన చేశారు. ఇపుడు టారిఫ్ ల ఎఫెక్ట్ తో ఈ డీల్ కార్యరూపం దాల్చడం లేదు.



# సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక

- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ఆగస్టు 7న నోటిఫికేషన్, 21న నామినేషన్‌కు చివరి తేదీ
- సెప్టెంబర్ 9న పోలింగ్.. అదే రోజు కౌంటింగ్

**ఢిల్లీ, మహా:** నూతన ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. సెప్టెంబర్ 9న నూతన ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. జగదీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయగా, దానిని రాష్ట్రపతి ఆమోదించడంతో నూతన ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఆగస్టు 7న నోటిఫికేషన్ విడుదల, 21న నామినేషన్ దాఖలుకు చివరి తేదీ, 22న స్క్రూటినీ ఉంటుంది. ఆగస్టు 25వ తేదీ వరకు నామినేషన్ ఉపసంహరణకు గడువు ఉంటుంది. సెప్టెంబర్ 9న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. పోలింగ్ పూర్తయిన తర్వాత ఓట్ల లెక్కింపు ఉంటుంది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆరోగ్య పరమైన కారణాలతో రాజీనామా చేసినట్లు ఆయన రాష్ట్రపతికి రాసిన లేఖలో పేర్కొన్నారు. 2022 ఆగస్టు 11న ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకు పదవీ కాలం ఉంది. ఆయన రెండేళ్ల ముందే వైదొలిగారు.

**ముఖ్యమైన తేదీలు..**

- నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ ప్రారంభం 2025 ఆగస్టు 7
- నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ 2025 ఆగస్టు 21
- నామినేషన్ల పరిశీలన 2025 ఆగస్టు 22
- నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ 2025 ఆగస్టు 25
- పోలింగ్ తేదీ 2025 సెప్టెంబర్ 9న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు
- కౌంటింగ్ 2025 సెప్టెంబర్ 9 (పోలింగ్ ముగిసిన తర్వాత)

## గళమెత్తాలన్నా.. గద్దె దింపాలన్నా

# కమ్యూనిస్టులే...

**రెండుసార్లు వాళ్ళ పోరాటం వల్లే కాంగ్రెస్‌కు పవర్**

భవిష్యత్తులోనూ కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి సాగాలి

ఓనమాలు రానోళ్ళు కూడా.. జర్నలిస్టులమంటున్నరు

సోషల్ మీడియా ముసుగులో విషం చిమ్ముతున్నరు: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** ప్రజావ్యతిరేక విధానాలపై గళమెత్తాలన్నా.. అధికారంలో ఉన్నోళ్లను గద్దె దింపడానికైనా కమ్యునిస్టులు ఉపయోగపడతారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టులు అప్పటి ప్రభుత్వాలపై చేసిన పోరాటాల వల్ల అధికారంలోకి వచ్చిందని, ఆ భూమికను వారు పోషించారన్నారు. భవిష్యత్తులోనూ కాంగ్రెస్, కమ్యూనిస్టులపార్టీలు కలిసి సాగాలన్నారు. సీపీఎం ఆధ్వర్యంలోని 'నవ తెలంగాణ' 10 వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జర్నలిజం విలువలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఓనమాలు కూడా రానివాళ్లు సోషల్ మీడియా ముసుగుతో జర్నలిస్టుగా చలామణి అవుతున్నారని ఫైర్ అయ్యారు. అలాంటి వారిని సీనియర్లు జర్నలిస్టులు పక్కన పెట్టాలని.. కనీసం పక్కన కూడా కూర్చొబెట్టుకోవద్దని అన్నారు. ఆవారాగా రోడ్ల మీద తిరుగుతూ.. అసభ్యకరంగా మాట్లాడేవాడు జర్నలిస్టు అని చెప్పుకోవడం సోచనీమని పేర్కొన్నారు. తనకు మొదటి నుంచి కమ్యూనిస్టులంటే అపారమైన గౌరవం ఉందన్నారు. 2004లోనూ కాంగ్రెస్ గెలుపులో వారి పాత్ర మరువలేనిదని అన్నారు. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం రాజకీయ నేతల విశ్వసనీయత దెబ్బతిన్నట్లుగానే.. జర్నలిస్టుల విశ్వసనీయత క్రమంగా తగ్గుతూ వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టుల పాత్రను ఆయన ఉప్పుతో పోల్చారు. "ఏ వంటకంలో ఎన్ని మసాలాలు వేసినా ఉప్పు లేకపోతే రుచి రాదు. అలాగే ప్రజా సమస్యలపై ఎర్రజెండా గొంతు వినిపించినప్పుడే ప్రజలకు నమ్మకం కలుగుతుంది" అని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

**జర్నలిస్టులు లక్ష్మణరేఖ గీసుకోవాల్సిందే**

ప్రస్తుతం రాజకీయ నాయకుల విశ్వసనీయత ఎంత వేగంగా పడిపోతోందో, జర్నలిస్టుల విశ్వసనీయత కూడా అదే స్థాయిలో పడిపోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు సొంతంగా పత్రికలు, ప్రసార సాధనాలు ఏర్పాటు చేసుకోవడమే ఈ దుస్థితికి కారణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'నవ తెలంగాణ' దినపత్రిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, నిజమైన జర్నలిస్టులు ఇకనైనా ఒక లక్ష్మణరేఖ గీసుకోవాలని, జర్నలిజం ముసుగులో అరాచకం సృష్టిస్తున్న వారిని వేరుచేయాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. "గతంలో జర్నలిస్టులను ఎంతో గౌరవించేవాళ్లం. వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకుని ఎంతో హోంవర్క్ చేసి మాట్లాడేవాళ్లం. కానీ నేటి వింత పోకడల వల్ల ఆ పరిస్థితి మారింది. కొందరు సోషల్ మీడియా ముసుగులో పాకిస్థాన్ ఏజెంట్లుగా పనిచేస్తూ దేశ భద్రతకే ప్రమాదకరంగా మారుతున్నారు" అని హెచ్చరించారు. ఇలాంటి చర్యలను అరికట్టకపోతే సమాజానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. ప్రజా సమస్యల పట్ల నిబద్ధతతో పనిచేసే పత్రికలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వం మంచి పనులు చేస్తే మైకులో చెప్పాలని, తప్పులు చేస్తే చెవిలో చెప్పకపోయినా ఫర్వాలేదని, పత్రికల్లో రాస్తే వాటిని స్వీకరించి సరిదిద్దుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి పనిచేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, సీపీఎం నేతలు తమ్మినేని వీరభద్రం, రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జానం వెస్లీ పాల్గొన్నారు.

# పొలం బాట పట్టిన ప్రజాప్రతినిధి

- నాటు వేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య
- రైతు కూలీ అక్కచెల్లెమ్మలతో సంపక్తి భోజనం
- పొలంలో నారు పికి 'వరి నాటు'లో మమేకం





**టేకులపల్లి,మహా:**

ఇల్లందు నియోజకవర్గ ప్రజల మనసుల్లో తనదైన ముద్ర వేసుకున్న శాసనసభ్యులు కోరం కనకయ్య మళ్లీ ఒకసారి ప్రజల మనస్సులను తాకే విధంగా వ్యవహరించారు. మండల పర్యటనలో భాగంగా టేకులపల్లి మండలంలోని బేతంపుడి గ్రామం వద్ద ఆయన చేసిన వినయపూరితమైన చర్య ప్రజల్లో విశేష స్పందన కలిగించింది. మధ్యాహ్న భోజన విరామ సమయంలో రోడ్డు వెంబడి పొలాల్లో వరి నాటు పనుల్లో నిమగ్నమైన కూలీ అక్కచెల్లెమ్మలను గమనించిన ఎమ్మెల్యే తాను ప్రయాణిస్తున్న కారును ఆపి, వారి వద్దకు వెళ్లారు. కేవలం పలకరించేందుకు కాదు, వారితో సంపక్తిగా భోజనం చేయడం, ఆ తర్వాత స్వయంగా చేతికి మడచుకొని నారు పికి నాటు వేయడం ఒక ప్రజాప్రతినిధి నిజమైన సానుభూతి, మానవత్వానికి ప్రతీకగా నిలిచింది.

పట్టభద్రుడైన శాసన సభ్యుడు, అధిక స్థాయిలో ఎదిగిన నేత అయినా, మట్టిలో కలిసిపోయే తత్వం కలిగిన కోరం కనకయ్య పొలం వద్ద వర్షపు మబ్బుల్లో మట్టి నిమగ్నమైన మహిళా కూలీల మధ్య కాలినడకన చేరి, వారి జీవితాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. కేవలం పథకాల ప్రకటనలకే పరిమితం కాకుండా, భౌతికంగా అక్కడ ఉండి వారి బాధలు తెలుసుకోవాలన్న ఆత్మీయత ఆయన నడకలో, భోజనంలో, చేతి పనిచేసిన ప్రతి నిమిషంలో కనిపించింది.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...**

"వ్యవసాయ కూలీలు, మహిళా రైతులు నిజమైన శ్రమజీవులు. వారికి కష్టమొస్తే వ్యవసాయ రంగానికి గుండెదు నొప్పి. వాళ్లతో కలిసి పొలం దిగి మట్టి పాలి పెట్టడం వల్ల నాకూ ఒక కొత్త ఉత్సాహం వచ్చింది. పాలకులుగా మేము ప్రజల కష్టాన్ని ప్రత్యక్షంగా చూడాలి. పట్టించాలి. అప్పుడు మాత్రమే పాలన న్యాయంగా ఉంటుంది" అని భావోద్వేగంగా అన్నారు. బేతంపుడి రైతులు, మహిళలు ఎమ్మెల్యే ఈ అనూహ్య విచ్చేస్తి ఆశ్చర్యంతోపాటు గౌరవాన్నికూడా చాటారు. "ఇంతటి స్థాయిలో ఉన్న మన ఎమ్మెల్యే మాకు ఇంత దగ్గరగా వచ్చి భోజనం చేయడం, పనిలో పాల్గొనడం ఎన్నడూ చూడలేదు. ఆయన మనల్ని మన వుల్లా చూశారు" అని గుండెపోటుతో స్పందించారు. ఇల్లందు నియోజకవర్గంలో నూతన రాజకీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తున్న కోరం కనకయ్య ఇలా ప్రజల మధ్యకి అడుగుపెట్టి, శ్రమను పంచుకుంటూ ముందుకు సాగడమంటే పాలనకు మరో రూపాన్ని ఇవ్వడమే అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



### సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో

# న్యూ తెలంగాణ మోడల్

## ప్రేమతో కూడుకున్న రాజనీతి మనది.. దేశానికి మోడల్ గా నిలిచాం

ఉమ్మడి రంగారెడ్డి ముఖ్యనేతల సమావేశంలో ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్

రెండోరోజు ఆందోల్ లో కొనసాగిన పాదయాత్ర.. పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్, మంత్రులు

**పరిగి, ఆందోల్, మహా:** దేశంలో ఇపుడు తెలంగాణ మోడల్ పై చర్చజరుగుతున్నదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో న్యూ తెలంగాణ మోడల్ వైపు అందరూ చూస్తున్నారని ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. శుక్రవారం ఉమ్మడి రంగారెడ్డి ముఖ్యనేతల సమావేశంలో ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ పాల్గొని మాట్లాడారు. ఆర్ ఎస్ ఎస్ కు కాంగ్రెస్ కు వ్యత్యాసం ఉందన్నారు. ఆర్ ఎస్ ఎస్ స్వార్థం తో కూడుకున్నదని నిస్వార్థం తో మనం ఉన్నామన్నారు. అవినీతి తో కూడుకున్న రాజ్యాంగం బీజేపీది అయితే ప్రేమతో కూడుకున్న రాజనీతి కాంగ్రెస్ దన్నారు. రెండింటిలో తెలంగాణ మోడల్ గా నిలిచామని, ఒకటి కులగణన మరొకటి జనగణనలో కులగణన డిమాండ్ చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచి సాధించామన్నారు. రోగం ఏంటో తెలిస్తేనే వైద్యం అందేది.. అలాంటి పనే రాహుల్ గాంధి చేశారన్నారు. రాహుల్ గాంధీ అనేక విషయాల్లో తెలంగాణ మోడల్ గురించి ప్రస్తావిస్తారని, స్వార్థం కోసం పని చేసే వ్యక్తి కాంగ్రెస్ కార్యకర్త కాదని, నిస్వార్థంగా పని చేసే నిక్కర్సైన కార్యకర్తలు కాంగ్రెస్ వాళ్ళన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో న్యూ తెలంగాణ మోడల్ ప్రేమను విస్తరింప చేసేలా సాగుతున్నదన్నారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

**కేసీఆర్ సంతకం వల్లే బనకచర్ల ప్రాజెక్టు- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్**

హరీష్, రావు కేసీఆర్ సంతకం పెడితేనే బనకచర్ల నిర్మాణానికి బీజం పడిందని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ విమర్శించారు. ఆందోల్ లో పాదయాత్రకు ఘనస్వాగతం పలకగా, ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీసీలకు 42 రిజర్వేషన్లతో కవితకు ఏం సంబంధం అని ప్రశ్నించారు. కవిత జెండా రంగు మారింది, గులాబీ నుండి బ్లూ రంగుకు వచ్చిందని ఎద్దేవా చేశారు. రంగులు మార్చేవారు కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక నిబద్ధత ఉందని, కాంగ్రెస్ పార్టీ అంటే ఒక నమ్మకం ఉందన్నారు. కేసీఆర్, హరీష్ రావుల చేతగానితనం వల్ల బనకచర్ల ప్రాజెక్ట్ కట్టారని విమర్శించారు. హరీష్, రావు కేసీఆర్ సంతకం పెడితేనే బనకచర్ల నిర్మాణం జరిగిందన్నారు. కార్యక్రమంలో మీనాక్షి నటరాజన్ తో పాటు మంత్రి దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

### గొర్రెల స్కాం

# రూ.1000 కోట్లు

## గుర్తించిన ఈడీ.. మాజీ మంత్రి తలసాని ఓఎస్డీ ఇంట్లో ఈడీ సోదాలు

లబ్ధిదారులకు వెళ్లాల్సిన నిధులు ప్రైవేటు వ్యక్తుల ఖాతాలకు వెళ్లినట్లు గుర్తింపు

కుంభకోణంలో పెద్దల పాత్ర



**(మొదటిపేజీ తరువాయి)**

గొర్రెల పంపిణీ కుంభకోణం కేసులో ఈడీ జులై 30వ తేదీనే హైదరాబాద్‌లో ఆరుచోట్ల సోదాలు చేపట్టింది. పశుసంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ రామచందర్ నాయక్, ప్రధాన నిందితుడు మొయినుద్దీన్, పలువురి ఇళ్లలో అధికారులు సుదీర్ఘంగా తనిఖీలు చేశారు. మొదటగా ఈ కుంభకోణంపై తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసింది. దీని ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరో కేసు నమోదు చేసి విచారణ చేస్తోంది. గొర్రెల పంపిణీతో రూ.1000 కోట్ల అక్రమాలు జరిగినట్లు ఈడీ తాజాగా గుర్తించింది.

**రికార్డుల్లో రూ.4వేల కోట్ల విలువైన గొర్రెల పంపిణీ**

2015లో అప్పటి టీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది అర్హులైనవారికి సుమారు రూ. 4వేల కోట్ల విలువైన గొర్రెలను పంపిణీ చేసినట్లు రికార్డులలోని గణాంకాలు చెబుతున్నాయి. ఈ పథకంలో మొదటి నుంచి కొందరు అధికారులు, దళారులు కుమ్మక్కై నిధులను దోచుకున్నట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. కొంత మంది విక్రేతలకు డబ్బులు చెల్లించినట్లు రికార్డుల్లో చూపించి, ఆ నిధుల్ని ఈ దళారుల ముఠా స్వాహా చేసింది. ఈ నిధులను బినామీ ఖాతాల్లోకి మళ్లించి అందరూ కలిసి వాటాలేసుకుని మరి పంచుకున్నట్లు వెల్లడైంది. ఈ గొర్రెల పంపిణీ కుంభకోణంలో కొందరు పెద్దల పాత్ర కూడా ఉన్నట్లు ఏసీబీ, ఈడీ సంస్థలు అనుమానిస్తున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హైదరాబాద్‌లో ఏకకాలంలో సోదాలు చేయడం, అక్రమాలు ఎక్కువ జరిగిన జిల్లాలపై దృష్టి సారించనుండటంతో అందులో పాలుపంచుకున్న వారిలో కలవరం మొదలైంది.

**కరీంనగర్ లో ప్రకంపనలు**

గత ప్రభుత్వ హయాంలో 2017 నుంచి యూనిట్‌కు 21 గొర్రెల చొప్పున కరీంనగర్ జిల్లాలో 58,817 యూనిట్లు పంపిణీ చేశారు. దీంతో కొందరు వ్యాపారులు, అధికారులు కుమ్మక్కైన ఘటనలు అప్పట్లోనే చాలా వెలుగులోకి వచ్చాయి. విచారణలు జరిగినా కొందరు అధికారులపై చర్యలు తీసుకున్నా పోయిన ప్రభుత్వ సొమ్ము మాత్రం పూర్తిస్థాయిలో సర్కారు ఖజానాకు రాలేదు. కరీంనగర్ జమ్మికుంట మండలం కోరపల్లికి చెందిన 20 యూనిట్లు ఏకంగా పక్కదారి పట్టాయి. హుజూరాబాద్ నియోజకవర్గంలోనే పెద్దఎత్తున ఇవి జరిగాయి. 2018 మార్చి 13న ఇక్కడి గొర్రెలను లారీలో తీసుకెళ్తుండగా జోగులాంబ గద్వాల జిల్లాలో పోలీసులు పట్టుకున్నారు. తొలి మూడు సంవత్సరాల పంపిణీపై జరిగిన అవకతవకలపై గతంలోనే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ తప్పుబట్టింది.

## అక్రమ మైనింగ్‌పై కొరడా

### ఐదు ట్రాక్టర్లు, రెండు జేసీబీలు సీజ్.. జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి

**వికారాబాద్, మహా :** అక్రమంగా మైనింగ్ జరుపుతున్న వారిపై జిల్లా పోలీసులు కొరడా ఝుళిపించారు. పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్ సింగ్ తండా శివారులో అక్రమ ఎర్రరాయి తవ్వకాలపై జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు ఈ రోజు మెరుపు దాడి చేశారు. అక్రమంగా తవ్విన ఎర్ర రాయిని కర్ణాటక రాష్ట్రానికి తరలించడానికి సిద్ధంగా ఉన్న ఐదు ట్రాక్టర్లు, తవ్వకాలకు ఉపయోగిస్తున్న రెండు జేసీబీలను జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకొని సీజ్ చేసి, వారిపై పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక, రాతి, మట్టి, ఇతర ఖనిజాలను అక్రమంగా తవ్వడం, తరలించడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. అటువంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు

### చెంప చెళ్లుమనిపించాలి..

# అనిపిస్తుందా?

## సీఎం పదవిలో ఉండి విలేఖరులపై ఇలా మాట్లాడడం సబబా

రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై టీ-బీజేపీ చీఫ్ రామచందర్ రావు ఫైర్



**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. యూట్యూబ్ జర్నలిస్టులను ఉద్దేశించి రేవంత్ రెడ్డి వ్యాఖ్య చేశారు. నవ తెలంగాణ 10వ వార్షికోత్సవ సభలో సీఎం మాట్లాడుతూ..నాకైతే అప్పుడప్పుడూ.. కిందకు దిగి.. జర్నలిస్టుల చెంపలు చెడామడా పగలగొట్టాలని అనిపిస్తుంది. కానీ పరిస్థితులు, హోదా అడ్డు వస్తూ ఉంటాయి. గతంలో జర్నలిస్టులను చూస్తే, మర్యాద ఇచ్చి, పలుకరించి, ప్రెస్ మీట్ అయ్యాక, వాళ్లతో పది నిమిషాలు మాట్లాడి, నేను చెప్పిన దాంట్లో ఏమైనా లోపం ఉందా, నా ఉద్దేశం ఇది అని చెప్పేవాణ్ని" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆ వ్యాఖ్యలపై రామచందర్‌రావు 'ఎక్స్' వేదికగా కౌంటిరిచ్చారు. 'చెంప చెళ్లుమనిపించాలనిపిస్తుందా? ఇది ప్రజాప్రతినిధి మాట్లాడాల్సిన మాటలా? ముఖ్యమంత్రి పదవిలో ఉండి విలేఖరులపై ఇలా మాట్లాడడం సబబా??, ఓ వార్షికోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. భౌతిక దాడికి దిగాలనిపిస్తుంది అని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ప్రజాస్వామ్యంలోని నాల్గవ స్తంభమైన పాత్రికేయులపై పరుషంగా మాట్లాడడం రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయనే దానికి తార్కాణం. ఇంకా ఈ కర్కశ కాంగ్రెస్ నేతల టార్గెట్ లిస్టులో ఇంకెందరు ఉన్నారో ఇంకెవరు ఉన్నారో' అని మండిపడ్డారు.

## నిరాహార దీక్షకు ప్రభుత్వం కొర్రీలు

- ఎందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వట్లేదు?
- హైకోర్టును ఆశ్రయించి అనుమతి తెచ్చుకుంటాం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, మహా:** బీసీ బిల్లు ఎంత అవసరమో దేశానికి చాటి చెప్పేందుకు ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటల దీక్ష చేయనున్నట్టు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ నిరాహార దీక్షకు ప్రభుత్వం కొర్రీలు పెడుతోందని ఆమె మండిపడ్డారు. అనుమతి ఇచ్చేందుకు తెలంగాణ పోలీసులు నిరాకరిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టును ఆశ్రయించి దీక్షకు అనుమతి తెచ్చుకుంటామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదని చెప్పారు. ప్రభుత్వం అడ్డుకున్నా.. ఎన్ని ఆటంకాలు సృష్టించినా 72 గంటల నిరాహార దీక్ష చేస్తానని కవిత తేల్చి చెప్పారు. దీక్షపై ప్రకటన చేసిన రోజే సెంట్రల్ జోన్ పోలీసులు అనుమతి కోరుతూ దరఖాస్తు అందజేసినట్లు తెలిపారు. అనుమతిపై నిర్ణయం ప్రకటిస్తామని శుక్రవారం వరకు సాగదీశారని, దీక్షకు అనుమతి ఇవ్వడానికి పోలీసులు ఏవేవో సాకులు చెబుతున్నారని మండిపడ్డారు.

### బనకచర్ల ప్రాజెక్టు

# అడ్డుకుని తీరుతాం

## మంద బలంతో లోకేష్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడు

మీరు ఎన్ని కుట్రలు చేసినా మీ ఆటలు ఇకపై సాగనివ్వం

ఏపీ మంత్రి లోకేష్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కౌంటర్

వ్యాఖ్యలను సీఎం, మంత్రులు ఎవరూ ఖండించలేదని ఆగ్రహం



**హైదరాబాద్:** గోదావరి బనకచర్ల ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకోవట్లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆ ప్రాజెక్టును ఎలా ఆపాలో బీఆర్ఎస్ పార్టీకి తెలుసన్నారు. బనకచర్లను ఉద్దేశించి ఏపీ మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యల నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో మీడియాతో హరీశ్ రావు మాట్లాడారు. ప్రాజెక్టును కట్టి తీరుతామని లోకేష్ మాట్లాడుతుంటే తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. 'మా తెలంగాణ హక్కుల సంగతి ఏమిటి' అని ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి, కాంగ్రెస్ నాయకులు ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏదో లోపాయికారి ఒప్పందం చేసుకున్నందువల్ల వారు మాట్లాడటం లేదని ఆయన ఆరోపించారు. గోదావరిబనకచర్ల అజెండాలో ఉంటే తాము ఉమ్మడి రాష్ట్రాల సమావేశానికి రాబోమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేంద్రానికి లేఖ రాస్తే, ముఖ్యమంత్రి, అధికారులు మాత్రం ఇటీవల హాజరయ్యారని గుర్తుచేశారు. రాత్రికి రాత్రి ఢిల్లీకి వెళ్లి... మొదటి అంశమే బనకచర్ల ఉన్నప్పటికీ సమావేశంలో పాల్గొని, కమిటీ వేయడానికి అంగీకరించారని ఆరోపించారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల ధైర్యం చూసుకొని లోకేశ్ బనకచర్ల కట్టి తీరుతామని చెబుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బనకచర్లపై ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీ మౌనం కారణంగానే చంద్రబాబు బనకచర్లపై బుల్డోజింగ్ విధానంతో వెళుతున్నారని విమర్శించారు. మేం బనకచర్ల కట్టి తీరుతామని లోకేశ్ చెబుతుంటే, అసలు బనకచర్ల కడితే కదా అడ్డుకునేది అని రేవంత్ రెడ్డి చెబుతుండటం విడ్డూరంగా ఉందని అన్నారు.

**నీళ్లు ఏపీకి పోవాలి అనే కుట్ర..**

ఇక్కడ ఉన్నది బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రయోజనాల కోసం పదవులను గడ్డి పోచలుగా వదులుకున్నోళ్లమన్నారు హరీశ్ రావు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, మీకు వివరాలు పంపిస్తా చూసుకోండన్నారు. 'అనుమతులు లేవు అని ఎలా అంటావు.. ఎప్పుడు తెలంగాణ ప్రాజెక్టులు అడ్డుకోలేదని చెబుతున్న లోకేష్, ఇదే విషయం గురించి మీ నాన్నని అడగండి. ఒక్క కాళేశ్వరం వ్యతిరేకిస్తూ మీ నాన్న ఏడు ఉత్తరాలు రాసారు. మీరేమో వ్యతిరేకించలేదు అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇచ్చిన అనుమతులు నిలిపివేయండి, ప్రాజెక్టులు ఆపండి అని లేఖలు రాసారు. కాళేశ్వరం అనేది కొత్త ప్రాజెక్టు కాదు, ప్రాణహితలో అంతర్భాగం, అందుకే ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్ వర్తించదు అని స్పష్టంగా కేంద్రం పేర్కొన్నది. కాళేశ్వరానికి అవసరమైన 11 రకాల అనుమతులు తీసుకున్నాం. కాళేశ్వరం మీద కుట్ర చేసి, మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోయకుండా, నీళ్లు ఏపీకి పోవాలి అనే కుట్ర చేస్తున్నట్లుంది. ఏపీలో అక్రమ ప్రాజెక్టులు కట్టి కృష్ణా నదిలో నీళ్లు మళ్లించినట్లు, గోదావరి నీళ్లు మళ్లించాలనేది కుట్ర. రెండు నదులను హస్తాగతం చేసుకునే కుట్రలు జరుగుతున్నాయి. ఆనాడు ఉమ్మడి ఏపీలో అనేక కుట్రలు జరిగాయి. ఇప్పుడు బనకచర్ల కట్టి తీరుతాం అంటున్నారు. మీరు కట్టి తీరుతాం అంటున్నారు. మేము అడ్డుకొని తీరుతాం అంటున్నాం. మీ ప్రాజెక్టులను అడ్డుకోవడం మా ఉద్దేశం కాదు, మా హక్కుల గురించి మేం మాట్లాడుతున్నం. మా వాటా మాకు ఇవ్వండి.. గౌరవిస్తం, బుల్డోజ్ చేస్తం అంటే సహించేది లేదు.' అని మాజీ మంత్రి హరీశ్ రావు కామెంట్స్ చేశారు.

# బనకచర పాపం ముమ్మాటికీ కేసీఆర్‌దే...


- మన వాటాను ఆంధ్రాలో తాకట్టు పెట్టారు
- కవిత ఒక మహానటి.. పదేండ్లలో ఏనాడూ బీసీలు గుర్తు రాలేదా?
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్
- రిజర్వేషన్లు కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్
- దేశ చరిత్రలో ఏ రాష్ట్రం చేయని విధంగా కులగణన చేశాం

**రంగారెడ్డి, పరిగి, మహా:** బనకచర్ల పాపం ముమ్మాటికీ కేసీఆర్‌దేనని టీపీసీసీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే మన నీళ్ల వాటాను ఆంధ్రాకు తాకట్టు పెట్టారని.. ఏ మొహం పెట్టుకొని హరీశ్ రావు మీడియా ముందు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీసీ రిజర్వేషన్‌కు కేసీఆర్ ఫ్యామిలీకి సంబంధమేంటి? అని ప్రశ్నించారు. రాజకీయాల్లో ఇచ్చిపుచ్చుకోవడం ఉండాలని, అదే కాంగ్రెస్ పార్టీ నీతి అని తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కవిత ఒక మహానటి అని, పదేండ్లలో ఆమె ఏనాడైనా బీసీల సంక్షేమం కోసం మాట్లాడిందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో డిక్లరేషన్ పెట్టిందని, ఆచరణలో పెట్టబోతున్నామన్నారు. ఎన్నో ఏండ్ల పాటు 42 శాతం రిజర్వేషన్ కోసం పోరాడిన పార్టీ కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. ఈ నెల 5న పార్లమెంట్‌లో, 6జంతర్ మంతర్ వద్ద ధర్నా, 7న ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాను కలుస్తున్నామన్నారు. ప్రజలు ఎంత వరకు సంతోషంగా ఉన్నారు? ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో అనే విషయాలను పాదయాత్ర ద్వారా తెలుసుకుంటున్నామని చెప్పారు. ప్రతి కార్యకర్త కష్టార్జితం వల్లే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. కష్టపడ్డ వాళ్లకే అవకాశం దక్కుతుందని, కింది స్థాయి నుంచి పనిచేసే వారే అసలైన నాయకులు అని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

**రిజర్వేషన్లు కాంగ్రెస్ కమిట్‌మెంట్..**

తాము అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యలో ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ పాదయాత్రను ప్రారంభించామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇది కేవలం ఒక రాజకీయ కార్యక్రమం కాదని స్పష్టం చేశారు. పరిగి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ముఖ్య ఉద్దేశం ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడం, వారి సమస్యలు తెలుసుకోవడం అని ఆయన స్పష్టంగా తెలిపారు. ప్రజల జీవితాల్లో ఎదురవుతున్న వాస్తవాలను నేరుగా తెలుసుకోవడానికి, వారి సలహాలు, సూచనలు స్వీకరించడానికి ఇదొక సాధనంలా ఉందని అన్నారు. గాంధీ యాత్రల నుండి రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర వరకు పాదయాత్రలు దేశ ప్రజలను చైతన్యపరిచిన ఉదాహరణలుగా నిలిచాయని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన పాదయాత్రలు కూడా ప్రజల్లో కొత్త ఆశలు నింపాయన్నారు. అదే దారిలో టీపీసీసీ ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ యాత్రలో ఏఐసీసీ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొంటారని చెప్పారు. తదుపరి పాదయాత్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొననున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏడున్నర లక్షల కోట్ల అప్పులతో తాము అధికారం చేపట్టామని, అయినప్పటికీ ప్రతి నెలా 6 వేల కోట్ల అప్పు చెల్లిస్తూ, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గౌడ్ వివరించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో చాలా మంది చాలా రకాలుగా మాట్లాడుతున్నారని, కానీ బీసీలకు రిజర్వేషన్లు అనేది కాంగ్రెస్ పార్టీ కమిట్ మెంట్ అన్నారు.




# బాలయ్య సినిమాకు నేషనల్ అవార్డు

## 71వ ఉత్తమ చలన చిత్ర అవార్డుల ప్రకటన

### బెస్ట్ యాక్టర్స్‌గా దుమ్ములేపిన షారుక్ ఖాన్, విక్రాంత్ మస్సే.. ఉత్తమ నటి రాణీ ముఖర్జీ

- బెస్ట్ తెలుగు మూవీగా బాలయ్య 'భగవంత్ కేసరి'
- బలగం పాటకు కాసర్లశ్యామ్ కు అవార్డు
- ఏకంగా 7 అవార్డులు దక్కించుకున్న తెలుగు చిత్రసీమ

ఢిల్లీ, నేషనల్ ఫిల్మ్ అవార్డులను కేంద్రం అనౌన్స్ చేసింది. 2023 సంవత్సరానికి గాను ఈ అవార్డులను శుక్రవారం ప్రకటించారు. ఈ అవార్డు జ్యూరీ కమిటీ కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు నివేదికను అందజేసింది. మొత్తం 15 విభాగాల్లో అవార్డులను జ్యూరీ ఈ సందర్భంగా ప్రకటించింది. జాతీయ ఉత్తమ చిత్రంగా 12th ఫెయిల్‌కు అవార్డు దక్కింది. జాతీయ ఉత్తమ నటుడి అవార్డును ఇద్దరు నటులు పంచుకున్నారు. షారుక్ ఖాన్(జవాన్), విక్రాంత్ మస్సే(12th ఫెయిల్) ఎంపికయ్యారు. మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే (హిందీ)లో నటనకు గాను రాణీ ముఖర్జీని ఉత్తమ నటి అవార్డు వరించింది. అలాగే ఉత్తమ తెలుగు చిత్రంగా ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి నిలిచింది. అలాగే హనుమాన్, బలగం, బేబి, గాంధీ తాత చెట్టు లాంటి వాటికి కూడా అవార్డులు దక్కాయి. ఇక షారుక్ ఖాన్, విక్రాంత్ మస్సే బెస్ట్ యాక్టర్స్ అవార్డులు దక్కించుకోగా.. రాణీ ముఖర్జీ బెస్ట్ యాక్ట్రెస్‌గా నిలిచింది. ఉత్తమ యాక్షన్ (స్టంట్ కొరియోగ్రఫీ)లో హన్‌మాన్ చిత్రం అవార్డు అందుకోగా.. ఉత్తమ గేయ రచయితగా కాసర్ల శ్యామ్ (బలగం) అవార్డును సొంతం చేసుకున్నారు. దీంతో వరుసగా ఈ ఏడాది కూడా తెలుగు సినిమాలు జాతీయ స్థాయిలో సత్తా చాటినట్లు అయింది.

నేషనల్ ఫిల్మ్ అవార్డులు..

ఉత్తమ తెలుగు చిత్రం: భగవంత్ కేసరి
ఉత్తమ తమిళ చిత్రం: పార్కింగ్
ఉత్తమ పంజాబీ చిత్రం: గొడ్డె గొడ్డె చా
ఉత్తమ ఒడియా చిత్రం: పుష్కర
ఉత్తమ మరాఠీ చిత్రం: శ్యామ్‌చి ఆయీ
ఉత్తమ మలయాళ చిత్రం: ఉళ్లొలుక్కు
ఉత్తమ కన్నడ చిత్రం: కందీలు
ఉత్తమ హిందీ చిత్రం: కథల్
ఉత్తమ గుజరాతీ చిత్రం: వష్
ఉత్తమ బెంగాలీ చిత్రం: డీప్ ఫ్రిడ్జ్
ఉత్తమ అస్సామీ చిత్రం: రొంగటపు 1982
ఉత్తమ యాక్షన్ డైరెక్షన్: నందుపృథ్వీ (హనుమాన్)
ఉత్తమ కొరియోగ్రఫీ: వైభవి మర్చంట్ (దింఢోరా బాజే రే రాకీ ఔర్ రాణీ కి ప్రేమ్ కహానీ)
ఉత్తమ సాహిత్యం: కాసర్ల శ్యామ్ (ఊరు పల్లెటూరు బలగం)
ఉత్తమ సంగీత దర్శకత్వం: జి.వి.ప్రకాష్ కుమార్ (వాతి), హర్షవర్ధన్ రామేశ్వర్ (యానిమల్)
ఉత్తమ మేకప్: శ్రీకాంత్ దేశాయ్ (శామ్ బహదూర్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్: సచిన్, దివ్య, నిధి (శామ్ బహదూర్)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: మోహన్‌దాస్ (2018)
ఉత్తమ ఎడిటింగ్: మిథున్ మురళి (పూక్కాళం)
ఉత్తమ సౌండ్ డిజైన్: సచిన్ సుధాకరన్, హరిహరన్ (యానిమల్)
ఉత్తమ స్క్రీన్‌ప్లే: సాయి రాజేష్ (బేబి), రామ్‌కుమార్ బాలకృష్ణన్ (పార్కింగ్)
ఉత్తమ సంభాషణలు: దీపక్ కింగ్ రాణి (సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: ప్రశాంతను మహాపాత్ర (ది కేరళ స్టోరీ)
ఉత్తమ నేపథ్య గాయకులు: శిల్పా రావు (ఛలియా జవాన్), రోహిత్ (ప్రేమిస్తున్నా బేబి)
ఉత్తమ బాల నటులు: సుకృతి బండిరెడ్డి (గాంధీ తాత చెట్టు), కబీర్ఖండారే (జిప్సీ), ట్రీష తోషార్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ (నాల్ 2)
ఉత్తమ సహాయ నటులు: ఊర్వశి (ఉళ్లొలుక్కు), జాన్కి బోడివాలా (వష్), విజయరాఘవన్ (పూక్కాళం), ముత్తుపేట్టై సోము భాస్కర్ (పార్కింగ్)
ఉత్తమ ప్రధాన నటులు: రాణీ ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే), షారూఖ్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే (12th ఫెయిల్)
ఉత్తమ దర్శకత్వం: సుదీప్తో సేన్ (ది కేరళ స్టోరీ)
ఉత్తమ ఏవీజీసీ చిత్రం: హనుమాన్



ఉత్తమ బాలల చిత్రం: నాల్ 2
జాతీయ, సామాజిక విలువలను ప్రోత్సహించిన ఉత్తమ చిత్రం: శామ్ బహదూర్
జాతీయ ఉత్తమ చిత్రం: 12th ఫెయిల్


# అనుష్కా శెట్టి ఘాటి రిలీజ్ అప్పుడేనా?



అనుష్కా శెట్టి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఘాటి'. ఈ సినిమాలో విక్రమ్ ప్రభు మరో కీలక పాత్రలో నటించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో జాగర్ల మూడి రాధాకృష్ణ (క్రిష్) దర్శకత్వంలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. జూలైలో విడుదల కావాల్సిన ఈ సినిమా రిలీజ్ వాయిదా పడిన సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమాను నవంబరులో రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. వీఎఫ్ఎక్స్ వర్క్సపై మరింత శ్రద్ధ పెట్టి, మంచి క్వాలిటీతో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలన్నది టీమ్ ప్లాన్. దీంతో ఓ దశలో సెప్టెంబరులో రిలీజ్ అనుకున్నప్పటికీ నవంబరులో అయితే మరిన్ని థియేటర్స్ కూడా దొరకుతాయని, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్సకు మరింత సమయం లభిస్తుందని కూడా చిత్రయూనిట్ ఆలోచిస్తోందట. అయితే ఈ విషయంపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. 'ఘాటి' సినిమా తెలుగు, తమిళ, హిందీ, మలయాళంతో సహా పలు భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. ఈ సినిమాకు సంగీతం: నాగవెల్లి విద్యాసాగర్.

# బాణామతి బ్యాక్‌డ్రాప్‌లో చేతబడి సినిమా

శ్రీ శారద రమణా క్రియేషన్స్ బ్యానర్‌పై నంద కిషోర్ నిర్మిస్తున్న సినిమా 'చేతబడి'. కొత్త దర్శకుడు సూర్యాస్ ఈ మూవీని నిజజీవిత సంఘటనల ఆఘారంగా తెరకెక్కించారు. తాజాగా లుక్ రిలీజ్ చేయడంతో పాటు చిత్ర విశేషాలని దర్శకుడు మీడియాతో పంచుకున్నాడు. చేతబడి.. 16వ శతాబ్దంలో మన దేశంలో పుట్టింది. రెండు దేశాలు కొట్టుకోవాలన్న రెండు దేశాలు కలవాలన్నా.. ఒక బలగం ఉండాలి. కానీ ఒక చెడు శక్తితో మనిషిని కలవకుండా అతన్ని చంపే విద్యే చేతబడి. అది ఎంత భయంకరంగా ఉంటుందో ఇప్పటికే చాలా సినిమాల్లో చూపించారు. ఇందులో చాలా విభిన్నంగా చూపిస్తున్నాం. మన శరీరంలో ప్రతిదానికి ఓ ప్రాణం ఉంటుంది. జుట్టుకు కూడా ఒక ప్రాణం ఉంటుంది. ఆ వెంట్రుకల ఆధారంగానే ఈ సినిమా ఆధారపడి ఉంటుందని సూర్యాస్ తెలిపాడు. 1953 గిరిడ అనే గ్రామంలో యదార్థ సంఘటన ఆధారంగా చేసుకుని ఈ కథని సిద్ధం చేశారు. సీలేరు అనే గ్రామంలో 200 సంవత్సరాల క్రితం వెదురు బొంగులు చాలా దట్టంగా ఉంటాయి. వర్షం పడినా అవి నెలలోకి దిగవు. అలాంటి మట్టిలో బతికున్న నల్లకోడిని పెట్టి అమావాస్య రోజు బాణామతి చేస్తే ఎలా ఉంటుంది అనేది ఇందులో చూపించబోతున్నామని దర్శకుడు సూర్యాస్ చెప్పుకొచ్చాడు.



# యోగి ఆదిత్యనాథ్‌పై బయోపిక్.. విడుదలకు అడ్డుగా సెన్సార్ బోర్డ్




ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆధారంగా రూపొందుతున్న సినిమా 'అజయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఎ యోగి'.. దర్శకుడు రవీంద్ర గౌతమ్ తెరకెక్కిస్తున్నారు. అయితే, ఈ సినిమా విడుదలకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC) అడ్డుచెప్పింది. దీంతో చిత్ర యూనిట్ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. సర్టిఫికేషన్ దరఖాస్తులను తిరస్కరించడాన్ని సెన్సార్‌ను తప్పుబడుతూ వారు కోర్టులో సవాలు చేశారు. 'అజయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఎ యోగి' చిత్రంలో యోగి ఆదిత్యనాథ్ పాత్రలో అనంత్ జోషి నటించారు. ఆయన గురువు మహంత్ పాత్రలో పరేష్ రావల్ నటించారు. అయితే, ఈ సినిమా విడుదలకు సెన్సార్ బోర్డు అడ్డుచెప్పింది. దీంతో చిత్ర నిర్మాతలు ముంబై కోర్టును ఆశ్రయించి తమ వాదనను వినిపించారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో ఉన్న నవల ఆధారంగానే ఈ చిత్రాన్ని తెరకెక్కించామని చిత్ర నిర్మాతలు కోర్టుకు తెలిపారు. దీంతో ఇదే విధంగానే న్యాయస్థానం కూడా సెన్సార్ బోర్డును ప్రశ్నించింది. పుస్తకంపై ఎలాంటి సమస్యలు లేనప్పుడు సినిమాకు అభ్యంతరాలు ఎందుకని న్యాయమూర్తులు రేవతి మోహితే డెరే, నీలా గోఖలేలతో కూడిన ధర్మాసనం సెన్సార్ బోర్డును ప్రశ్నించింది. పుస్తకం ప్రజాక్షేత్రంలో ఉన్నప్పుడు లేని ఇబ్బంది సినిమా విడుదలకు ఎందుకు వస్తుందని న్యాయస్థానం నిలదీసింది. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని CBFCకి కోర్టు నోటీసు జారీ చేసింది.

# సినీ కార్మికుల వేతనాల పెంపు.. గడువు కోరిన ఫిల్మ్ ఛాంబర్




సినీ కార్మికుల వేతనాల పెంపుపై ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల మండలి గడువు కోరింది. ఈ మేరకు కార్మిక శాఖ కమిషనర్‌ను కలిసిన ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల మండలి ప్రతినిధులు రెండు రోజులు గడువు కోరారు. ఈ విషయాన్ని సినీ వర్కర్స్ ఫెడరేషన్ ప్రతినిధులకు కార్మిక శాఖ కమిషనర్ తెలిపారు. ఛాంబర్ ప్రతినిధులు, ఫెడరేషన్ ప్రతినిధులతో రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కార్మిక శాఖ కమిషనర్ వెల్లడించారు. అంత వరకు షూటింగ్స్ ఆపవద్దని ఫెడరేషన్ ప్రతినిధులను కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఇరు వర్గాలతో చర్చల ద్వారా కార్మికుల వేతనాల సమస్య ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com